# మ ని సి

నాంపల్లి స్టేషనులో స్నేహితుణ్ణి దిగబెట్టి వస్తుంటే ఎవరో పిలిచి నట్లయి వెనక్కి చూశాను.

ఎవరో ముసలాయన- తలపాగా, మాసిన ముతక బట్టలు, చేతిలో ఉబ్బుగాఉన్న గుడ్డసంచి నూటికి నూరుపాళ్ళు పల్లెటూరివాడని స్పష్టమవుతోంది.

"ఏం కావాలి" అన్నాను.

"పంచగొట్ట ఈడకెంత దూరముంటది ?"

"ఏం గొట్టా ?"

పంచగొట్ట గవరమెంటోల్లు ఇండ్లు కట్టి నారుసూడు అది"

"పంజగుట్ట ఇక్కడకు చాలాదూరం" అన్నాను.

"సానా అంటావా ? కాలుసాగదీసి అడుగేత్తే సేరుకోలేనంటవా?"

ముసలాడిని చూస్తే కోపంవచ్చింది. కొత్తవాడిని, సూటు బూటు మీదఉన్న వాడిని నన్ను కాస్త మర్యాదగా పలుకరించ కూడదా. పోనీలే పల్లెటూరి వాడని సరిపెట్టుకొన్నాను.

"ఏందయ్యా ఆలోసిస్తుంటివి "

"ఏం లేదు. పంజగుట్టకు నువ్వు నడవలేవు. బస్సులూ, బండ్లూ ఈ రద్దీలో దేనికిందనో పడ్డావంటే...."

"ఏం సెయ్యను? సూపానదు. కాలు సాగదు. అయినా పోక తప్పదు. పై సంచిలోని పైసలు ఏడనో జారిపోయె ఎట్ల పోవాల ?"

"అక్కడ నీ కెవరున్నారు ?"

"మా పిల్లగాడున్నడు. మవూరి రెడ్డోరి పెద్ద కొడుకింట్లో పని సేత్తున్నడు."

"నువ్వొస్తున్నావని తెలీదా ?"

"ఎట్ల దెలుస్తది, నేనేమన్నా జాబు రాస్తినా?"

బాగుంది ఇతని తర్కం, మధ్య నాకేం పట్టింది లెమ్మనుకొని పోతున్న రిక్షాను కేకేశాను.

"నువ్వూ పంచగొట్ట పోతుండవా, నన్ను దింపెల్లవూ?"

"లేదులేదు నేనిటు అశోక్‌నగరు వెళ్తున్నాను."

"అయితే రిచ్చాబండికి పైసలిచ్చిపో అయ్యా."

బాగుంది జబర్దస్తీ. "నేనెందు కిస్తాను. వెళ్ళెళ్ళు. నాదగ్గరేం డబ్బులు ప్రోగుపోసి లేవు అడ్డమయిన వాళ్ళందరికీ దానం చెయ్యటానికి.

"అదేంది గట్ల కసురుకొంటవు. నువ్వు పైస లివ్వకపోతే నేనిల్లు సేరేదెట్ల? నా పైసలు పోయినాయని సెప్పలా."

విసుక్కొంటూ పది పైసలు వాని చేతిలో పడేసి రిక్షాను పోనివ్వమన్నాను, ఆ ముసలాడు కళ్ళప్పగించి చూస్తూ నిలుచుండి పోయాడు.

అడుక్కోటంలో కూడా యిన్ని వేషాలా? అందులో ఇంత పొగరుబోతుగానా అడుక్కోటం? అది తెలియని తనం కాదు, అమాయకత అంతకంటే కాదు. మరీ వెంటబడి దబాయిస్తుంటే నాలాంటి అమాయకు డెవడో నాలుగు డబ్బులు రాల్చకపోతాడా అనే ధీమా, వీడి మొహానికి డబ్బులు పోయాయట, ఏవో లక్షలు మూటగట్టినట్లు మాట్లాడుతున్నాడు. ఆ దొంగకు దొరక్క దొరక్క ఇతని సంపదే దొరికింది కాబోలు. పట్టణాల్లో ఈ నాటకాలు ఎవరికి తెలీవు?

రిక్షావానికి డబ్బులిచ్చి ఇంట్లో అడుగుపెట్టాను. ఇంటో మాచిన్న తాతయ్య, ఇంకో యువకుడు కూర్చుని ఉన్నారు.

"నువ్వెప్పుడొచ్చావు తాతయ్యా? ఉత్తర మయినావ్రాయించ లేదే. ఇల్లెలా కనుక్కొన్నావు!" అని అడిగాను.

తాతయ్య నవ్వాడు. "ఉత్తరం వ్రాయించానురా! నీకు చేరినట్టు లేదు," అన్నాడు

అపరిచిత యువకునికేసి చూస్తూ "వీరెవరు?" అన్నాను.

అతను నవ్వుతూ తన పరిచయం తానే చేసి కొన్నాడు. నాపేరు ప్రసాదండీ. యూనివర్శిటిలో యం. ఏ. చదువుతున్నాను."

ఇంతలో తాతయ్య అందుకొన్నారు. "ఈ అబ్బాయి పుణ్యమా" అని యిల్లుచేరుకున్నాను. ఇంతకు ముందెన్నడయినా ఈ ఊరు వచ్చానా పాడా. ఎన్నడూ ఇల్లు కదలనివాడిని. ఇక్కడ తీర్థ యాత్రలకేవో బండ్లు వెళ్తాయని ఎవరో అంటె నీవన్నీ చూసుకుంటావుగదా అని

వచ్చాను. సుధచేత నీకు ఉత్తరం వ్రాయించాను. కుర్ర నాగమ్మ అడ్రసు ఎలా వ్రాసిందో ఏమో నీకది చేరనేలేదు"

"అడ్రసు సరిగా వ్రాసినా ఒక్కొక్కసారి చేరవులెండి" అన్నాడు ప్రసాదు.

"మీరు తాతయ్యను ఎలా కలిశారు!" అని అడిగాను.

"నా ఫ్రెండును పంపించటానికి నేను సికింద్రాబాద్ స్టేషనుకు వెళ్లానండి. వస్తుంటే తాతగారు బిక్క మొహంతో నిల్చుని ఉండటం కనిపించింది. దగ్గరకునెళ్ళి "సామాను బయటకుచేర్చి రిక్షా మాట్లాడ మంటారా తాతగారూ" అన్నాను. ఆయన "ఊ" అన్నారు. నేను రిక్షా పిలుస్తుంటే చెప్పారు "బాబూ నాకీ ఊరు క్రొత్త. మావాడు స్టేష నుకు రాలేదు మరి." "ఫర్వాలేదండి. నేను తోడువస్తాను. అడ్రసు తెలుసా ?" అని అడగాను. ఆయనకు అశోక్ నగర్ అని గుర్తుందేకాని నంబరూ అదీ సరిగా తెలిసినట్లు లేదు. ఇక్కడికి వచ్చాక మీ ఇల్లు కనుక్కోవటం ఏమంత కష్టంకాలేదు లెండి" అని నవ్వుతూ ముగిం చాడు ప్రసాదు.

"పట్టణాల్లో కూడా మంచీ చెడూ ఇంతగా అడిగి తెలిసుకొనే వాళ్ళుంటారని అనుకోలేదురా! ఎవరి బిడ్డయితేనేం వెయ్యేండ్లు చల్లగా వర్ధిల్లాలి. నాతోపాటు వచ్చి ఇల్లు వెతకటమేనా ! రిక్షా డబ్బులు కూడా తనే ఇచ్చాడు. నేను అమ్మాయిని పిలిచి ఇప్పించేవరకు ఆగితేనా"

రిక్షా డబ్బులయినా లేకుండా తాతయ్య ఊరికి వచ్చాడంటే నమ్మ లేకపోయాను. నా భావం కనిపెట్టినట్లు తాతయ్య తన చిల్లుజేబు చూపిం చాడు.

"జేబు కొట్టేశారా?" అన్నాను అదుర్దాగా.

"అవునురా, యాత్రలకని ఐదువందల పైనే తెచ్చాను. ప్రాప్తం లేదు, ఏం చేద్దాం?" అన్నాడు తాతయ్య.

పంజగుట్ట ముసలాడు మనసులో మెదిలాడు. నా కదోలా అని పించింది.